సాక్షి ప్రకాశం

గురువారం । 25 । ఏప్రిల్ । 2024



వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మంత్రి ఆదిమూలపు సురేష్ కోరారు. పొన్నలూరు మండలం విప్పగుంటలో ఆయన మాట్లాడారు. - 8లో..



కమనీయం.. రంగనాయకుని కల్యాణం

నెమలిగుండ్ల రంగనాయకస్వామి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 42/26

పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీలో పలువురి నియామకం

ఒంగోలు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శులుగా కొండపికి చెందిన కలికివాయి ఉమామహేశ్వరరావు, మార్కాపురానికి చెందిన కట్లా రమణయ్యలను నియమించారు. ఆమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

మోదీ ఫొటో లేకుండా టీడీపీ నేతల ప్రచారం

● బీజేపీ నేతల ఆగ్రహం



ప్రధాని మోదీ ఫొటో లేకుండా టీడీపీ పాంప్లెట్

మార్కాపురం: మార్కాపురం నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి తరఫున టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కందుల నారాయణరెడ్డి తన ప్రచారంలో ఇంటింటికీ అందిస్తున్న బాబు షూరిటీ... భవిష్యత్తు గ్యారంటీ పాంప్లెట్‌లో ప్రధాని నరేంద్రమోదీ ఫొటో లేకపోవడంపై బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి అభ్యర్థిగా ప్రచారం చేసుకుంటూ బాబూ సూపర్ సిక్స్ పథకాలపై ప్రధాని ఫొటో లేకపోవడం ఒక రకంగా తమను అవమానించడమేనంటున్నారు. ఇటీవల చంద్రబాబు మార్కాపురం వచ్చినప్పుడు ఫ్లెక్సీల్లో తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఫొటో లేకపోవడం, టీడీపీ ప్రచార రథంపై కూడా బీజేపీ నేతల ఫొటోలు లేకపోవడంతో అసంతృప్తితో రగిలిపోతున్నారు. తాము నిజాయితీతో అభ్యర్థి గెలుపుకోసం ప్రచారం చేస్తుంటే టీడీపీ నేతలు మాత్రం ప్రధాని ఫొటో లేకుండా అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాంప్లెట్‌లో కేవలం చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల ఫొటోలు మాత్రమే ఉన్నాయి.



కనిగిరిలో మద్యం షాపు వద్ద తెలుగు తమ్ముళ్ల హంగామా



ఒంగోలులో మద్యం షాపు వద్ద గుమిగూడిన టీడీపీ, జనసేన కార్యకర్తలు

మూడు షోలు.. ఫ్లాప్

■ ముఖం చాటేసిన జనం.. ఏరులై పారిన మద్యం ■ ఒంగోలు, కనిగిరి, గిద్దలూరులో ప్రహసనంగా టీడీపీ అభ్యర్థుల నామినేషన్లు

జిల్లాలో ముగ్గురు టీడీపీ అభ్యర్థుల నామినేషన్ ర్యాలీలు ఫ్లాప్ షోలుగా మారాయి. బుధవారం ఒంగోలు, గిద్దలూరు, కనిగిరి అభ్యర్థులు నిర్వహించిన ర్యాలీలకు జనం ముఖం చాటేయడంతో వారి అంచనాలు తలకిందులయ్యాయి. మందు, విందుతో జెండా కూలీలకు మర్యాద చేసినా ర్యాలీలు వెలవెలబోవడం అభ్యర్థులనే ప్రహసనానికి గురిచేసింది. మద్యం పంచుతున్నారంటూ నిత్యం విషం చిమ్ముతున్న పచ్చ నేతలు.. తమ ర్యాలీల్లో అదే మద్యాన్ని ఏరులై పారించారు. ఒంగోలుతో పాటు కనిగిరి, గిద్దలూరు ర్యాలీల్లో రోడ్ల వెంట మందుబాబులు హల్‌చల్ చేశారు. ఒంగోలులో మంగళవారం రాత్రే నగదు, మద్యం పంపిణీ చేసినా దామచర్ల ర్యాలీకి జన స్పందన కరువైంది. ప్రత్యేక వాహనాల్లో జనాలను పోగేసి తెచ్చినా ర్యాలీలో మాత్రం కనిపించలేదు. కూటమిలోని జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మొక్కుబడిగా పాల్గొన్నారు. అనుమతి లేకుండా ప్రైవేట్ స్కూల్ బస్సుల్లో జనాలను, విద్యార్థులను తరలించి నిబంధనలకు నీళ్లొదిలారు.

- టీడీపీ అభ్యర్థుల నామినేషన్లలో తాగి ఊగిన తెలుగు తమ్ముళ్లు
- ఒంగోలు, కనిగిరి, గిద్దలూరుల్లో ఏరులై పారిన మద్యం
- దామచర్ల జనార్దన్ నామినేషన్ ర్యాలీకి జన స్పందన కరువు
- గ్రామాల నుంచి ఆటోల్లో, స్కూల్ బస్సుల్లో జనాల తరలింపు
- జనాలు లేక అసహనంతో వాహనం దిగి వెళ్లిపోయిన దామచర్ల
- విడిగా బీజేపీ ర్యాలీ, మొక్కుబడిగా జనసేన జెండాలు

సాక్షిప్రతినిధి, ఒంగోలు: ఒంగోలు అసెంబ్లీకి టీడీపీ అభ్యర్థిగా దామచర్ల జనార్దన్ నామినేషన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఉమ్మడి కూటమిలో మూడు పార్టీలున్నాయి కదా వైఎస్సార్ సీపీకి చెందిన బాలినేని నామినేషన్ ర్యాలీ కంటే దద్దరిల్లుతుందని అనుకున్నారంతా... కానీ దామచర్ల నామినేషన్ ర్యాలీ అట్టర్ ఫ్లాప్‌గా నిలిచింది. కిలో మీటరు ర్యాలీ పట్టుమని 10 నిమిషాలు కూడా సాగలేదంటే ఏ మేరకు ర్యాలీకి జనాలు తరలివచ్చారో అట్టే అర్థమవుతోంది. మద్యం దుకాణాల వద్ద టీడీపీ నేతలు, కార్యకర్తలు క్యూ కట్టారు.

జన స్పందన కరువు...

దామచర్ల నామినేషన్‌కు జనాల నుంచి స్పందన కరువైంది. నగరవాసులు ఆసక్తి కనబర్చలేదు. వారం రోజులుగా 50 డివిజన్ల నాయకులతో సమావేశాలు నిర్వహించి ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలలో స్పందన కనిపించలేదు. తొలుత 9 గంటలకల్లా ర్యాలీని ప్రారంభమవుతుందని ప్రకటించారు.కార్యకర్తలు, నాయకులు కుటుంబ సమేతంగా తరలిరావాలని, ఎన్ని పనులున్నా మానుకొని పెద్ద సంఖ్యంలో నామినేషన్ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. బుధవారం నగరంలోని అన్నీ డివిజన్లకు ఆటోలు పంపించినప్పటికీ ప్రజలెవరూ ఆటోలు ఎక్కలేదు. ఖాళీ ఆటోలు తిరిగి వచ్చాయి. దీంతో దామచర్ల అసహనానికి గురయ్యారు. ఒంగోలు నగరంలోని దక్షిణ బైపాస్ నుంచి దామచర్ల నామినేషన్ ర్యాలీ ఉదయం 10.50 గంటలకు బయలుదేరింది. అయితే పెద్ద హంగామా చేద్దామనుకున్న దామచర్లకు ర్యాలీకి వచ్చిన కేడర్‌ను చూసి అసహనానికి గురయ్యాడు. దక్షిణ బైపాస్ నుంచి డీ మార్ట్ షాపింగ్ కాంప్లెక్స్ వరకు ప్రత్యేక వాహనంలో ర్యాలీలో బయలుదేరిన దామచర్ల ఉన్నట్టుండి ప్రత్యేక వాహనం దిగి ద్విచక్ర వాహనంపై ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లిపోయారు. ఆ తరువాత ఆ ప్రత్యేక వాహనంలో ఎంపీ అభ్యర్థితో పాటు ఇతర చోటా మోటా నాయకులు మాత్రమే ప్రత్యేక వాహనంలో ర్యాలీగా వెళ్లారు. నెల్లూరు బస్టాండ్ సెంటర్ వరకు



ఒంగోలులో ర్యాలీ కదిలిందో లేదో ఆటోల్లో ఇంటికి..

ర్యాలీ సాగింది. 11.10 గంటలకు ముగిసింది. ర్యాలీ ప్రారంభం కాగానే సెకన్లలో జనం ఆటోలెక్కి, బస్సులు ఎక్కి వెళ్లిపోతూ కనిపించారు. ఇక బీజేపీ వారు విడిగా ర్యాలీగా వచ్చి వెళ్లి పోయారు. జనసేనకు సంబంధించి వాహనంపై ఒకరిద్దరు నేతలు మినహా ర్యాలీలో అరకొరగా జెండాలు కనిపించాయి. ఒక నాయకుడు ర్యాలీలో నిబంధనలకు విరుద్ధంగా గుర్రం ఎక్కి హల్‌చల్ చేశాడు. రెండు రోజుల క్రితం ఒంగోలు నగరంలో వైఎస్సార్ సీపీ అసెంబ్లీకి పోటీ చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నామినేషన్ ర్యాలీ అశేష జనవాహిని మధ్య సాగింది. కర్నూల్ రోడ్డు ఫ్లై ఓవర్ నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరి చర్చి సెంటర్‌లోని ఆర్డీఓ కార్యాలయానికి వచ్చేందుకు ఏకంగా రెండు గంటలు పట్టింది. అంటే బాలినేని నామినేషన్‌కు జన సందోహం ఏ స్థాయిలో తరలివచ్చారో అవగతమవుతుంది.



అనుమలపల్లె బస్టాండ్ సెంటర్లో మద్యం తాగుతున్న తెలుగు తమ్ముళ్లు

నామినేషన్‌కు వెళ్తే మద్యానికి కరువు లేదు

రాచర్ల: గిద్దలూరు టీడీపీ అభ్యర్థి అశోక్‌రెడ్డి నామినేషన్ ర్యాలీలో మద్యం ఏరులై పారింది. అర్ధవీడు, కంభం, రాచర్ల మండలాలకు చెందిన వాహనాలను అనుములపల్లె బస్‌స్టాండ్ సెంటర్‌లో నిలిపి పక్కనే ఉన్న వ్యవసాయ పొలాల్లో మద్యం తాగారు. రూ.500 డబ్బులు, బిర్యాని ప్యాకెట్, క్వార్టర్ మద్యం పంపిణీ చేసి కార్యక్రమానికి తరలించారు. నామినేషన్‌కు వెళ్లే వాహనాలు రోడ్డుపై అడ్డంగా పెట్టడంతో నెమలిగుండ్ల రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలకు వెళ్లే భక్తులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

కనిగిరిలోనూ అదే కిక్కు..

కనిగిరి రూరల్: టీడీపీ కనిగిరి అభ్యర్థి ఉగ్ర నరసింహారెడ్డి నామినేషన్‌లో మద్యం ఏరులై పారింది. మందు, బిర్యానీ ప్యాకెట్, రూ.300 నగదు ఇచ్చి జనాలను తోలినా.. నామినేషన్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు కూడా జనం ఆగలేదు. చెప్పుల బజార్, నాజ్ సెంటర్, వైఎస్సార్ రోడ్డులోకి వచ్చే సరికి మందు బాబులు తప్ప సామాన్య జనం కనిపించలేదు.



కనిగిరిలో మద్యం తాగుతున్న టీడీపీ కార్యకర్తలు

నిబంధనలకు విరుద్ధంగా స్కూల్ బస్సులు



ఒంగోలులో ర్యాలీకి జనాన్ని తరలిస్తున్న స్కూల్ బస్సు

నామినేషన్ సందర్భంగా నిర్వహించే కార్యక్రమానికి నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ స్కూలు బస్సులను వినియోగించారు. అలాంటిది అనుమతి లేకుండా శ్రీ హర్షిణి విద్యాసంస్థలు, రైజ్ ఇంజినీరింగ్ కాలేజీ, శ్రీ సాయి కాన్సెప్ట్ స్కూలు బస్సులు ర్యాలీకి జనాలను తరలించేందుకు వినియోగించారు. ఒంగోలు నగరం నుంచి మూడు పార్టీలకు చెందిన కేడర్ ర్యాలీకి రావటానికి పెద్దగా ఆసక్తి చూపకపోవటంతో ఒంగోలు, కొత్తపట్నం మండలాల నుంచి జనాన్ని బస్సుల్లో తీసుకువచ్చారు. విద్యార్థులకు సెలవులు కావటంతో ర్యాలీకి చిన్నారులను కూడా తరలించారు. ఇక నిబంధనలకు విరుద్ధంగా ఆటోల్లో జనాలను కుక్కి మరీ గ్రామాలను నుంచి డబ్బులిచ్చి తీసుకొచ్చారు. నగరంలోని బ్రాందీ షాపుల ముందు పచ్చ పార్టీ నేతలు, కార్యకర్తలు క్యూకట్టారు.

పాత నేతలకు పాతరేశారు..

టీడీపీ నామినేషన్ ర్యాలీలో ఆపార్టీ సీనియర్ నేతలను చిన్న చూపు చూశారనే విమర్శలు వెల్లువెత్తాయి. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న సీనియర్ నేతలకు పాతరేసి.. పార్టీలో ఇటీవల కొత్తగా చేరిన వారికి, ఉగ్ర సేన నాయకులకు అగ్ర తాంబులం ఇచ్చారు. వాహనంలో సీనియర్లు ఒకరిద్దరు మాత్రమే ఉన్నారు. ఇది చర్చనీయాంశంగా మారింది. భారీగా నగదు ఖర్చుచేసినా.. అనుకున్న స్థాయిలో ర్యాలీ సక్సెస్ కాలేదనే చర్చ నడుస్తోంది.

జగన్ సీఎం అయితేనే రాష్ట్రానికి మేలు



అభివాదం చేస్తున్న మేరుగు నాగార్జున, నందిగం సురేష్, బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి



మేరుగు నాగార్జున నామినేషన్‌కు తరలి వచ్చిన జన సందోహం

- మేలు జరిగితేనే ఓటేయండని చెప్పే దమ్మున్న నాయకుడు జగన్
- సంతనూతలపాడు నుంచి మేరుగు నాగార్జునను, బాపట్ల నుంచి నందిగం సురేష్‌ను ఆశీర్వదించండి
- సంతనూతలపాడు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మేరుగు నాగార్జున నామినేషన్‌లో పాల్గొన్న బాలినేని, బూచేపల్లి, నందిగం

చీమకుర్తి: పేదల జీవితాల్లో వెలుగులు నిండాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రానికి మేలు జరుగుతుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మేరుగు నాగార్జున అన్నారు. బుధవారం నామినేషన్ పత్రాలను సమర్పించే సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్, దర్శి అసెంబ్లీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాదరెడ్డితో కలిసి చీమకుర్తి బస్టాండ్‌లో నిర్వహించిన ర్యాలీలో మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడారు. మేనిఫెస్టోలో చెప్పింది చెప్పినట్లుగా చేసి మేలు జరిగితేనే ఓటేయండని చెప్పే దమ్మున్న నాయకుడు మన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో ప్రజలకు చెప్పుకోవడానికి ఒక్క పథకమైనా ఉందా..? అని ప్రశ్నించారు. చంద్రబాబు పాలనంతా అవినీతి,



మేరుగు, నందిగం, బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

ఆశ్రిత పక్షపాతం, రాష్ట్ర సంపదను కొల్లగొట్టడం తప్ప ఏముందని ఎండగట్టారు. ఒళ్లు దగ్గరపెట్టుకొని పనిచేస్తాను, ఊరూరా తిరిగి అభివృద్ధి చేస్తానని, తనను సంతనూతలపాడు ఎమ్మెల్యేగా ఆశీర్వదించి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ బూచేపల్లి కుటుంబం రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి ఇంత వరకు సంతనూతలపాడు నియోజకవర్గంలో మన పార్టీ ఓటమి ఎరుగదని, మళ్లీ అదే గెలుపుని నిలబెట్టుకుంటామని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున మేరుగు నాగార్జునను గెలిపించుకుంటామన్నారు. బాపట్ల ఎంపీ, ప్రస్తుత వైఎస్సార్ సీపీ బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎదురొచ్చే దమ్ములేకనే టీడీపీ, జనసేన కూటమి పార్టీలన్నీ ఒక్కటయ్యాయని ఎద్దేవా చేశారు. అయినా కుప్పం, మంగళగిరి, పిఠాపురంలో టీడీపీ కూటమి ఓడిపోవడం ఖాయం అని నందిగం సురేష్ జోస్యం చెప్పారు. దర్శి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఒంటరిగా ఎదుర్కోలేక చంద్రబాబు, పప్పు, దత్తపుత్రుడు కలిసి కూటమిగా వస్తున్నారన్నారు. సంతనూతలపాడు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మేరుగు నాగార్జునను, బాపట్ల నందిగం సురేష్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ర్యాలీలో మాట్లాడిన అనంతరం బస్టాండ్ నుంచి నూతన మున్సిపల్ కార్యాలయం వద్దకు ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డితో కలిసి మేరుగు నాగార్జున తన నామినేషన్ పత్రాలు సమర్పించారు. తొలుత నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి స్వచ్ఛందంగా వచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ర్యాలీ ప్రారంభం కాబోయే ముందు చీమకుర్తిలోని బూచేపల్లి ఇంజినీరింగ్ కాలేజీ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి భారీగా గజమాలలతో మేరుగు నాగార్జున, బూచేపల్లి వెంకాయమ్మ, నందిగం సురేష్, బూచేపల్లి శివప్రసాదరెడ్డిని సత్కరిస్తూ పూల వర్షం కురిపిస్తూ బస్టాండ్ వరకు సాగిన ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో బాపట్ల యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మేరుగు చందన్‌నాగ్, నియోజకవర్గ పరిశీలకుడు దేవినేని మల్లికార్జునరావు, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్‌లు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం అభివృద్ధే అజెండా



ర్యాలీలో మాట్లాడుతున్న తాటిపర్తి చంద్రశేఖర్, పక్కన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



తాటిపర్తి నామినేషన్‌కు స్వచ్ఛందంగా తరలి వచ్చిన అశేష జనవాహినిలో ఒక భాగం

- తాటిపర్తి, చెవిరెడ్డిలను భారీ మెజార్టీతో గెలిపించండి
- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- యర్రగొండపాలెం వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన తాటిపర్తి చంద్రశేఖర్
- పాల్గొన్న ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బాలినేని శ్రీనివాసరెడ్డి, జంకె

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి అండతో యర్రగొండపాలెం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ నామినేషన్ సందర్భంగా బుధవారం నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తిగా వెనకబడిన పశ్చిమ ప్రాంతాన్ని జగనన్న అభివృద్ధి బాటలో నడిపారని, ఇంకా అభివృద్ధి చెందాల్సిన ఈ ప్రాంతంపై తాము ప్రత్యేక దృష్టి పెట్టి మరింతగా అభివృద్ధి చేస్తామని మాట ఇచ్చారు. టీడీపీ పాలనలో వెలిగొండ ప్రాజెక్ట్‌ను నిర్లక్ష్యంగా వదలేశారని, ఆ ప్రాజెక్టుకు కేటాయించిన నిధులు దిగమింగారని విమర్శించారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే వెలిగొండ ప్రాజెక్టు పనులు వేగవంతం చేసి పూర్తి చేయడమే కాకుండా ఆయన చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారన్నారు. రాష్ట్రాన్ని మరో సారి దోచుకోవటానికి పచ్చ దండు మీ ముందుకు వస్తోందని, జగనన్నను ఎదుర్కోవటానికి కూటమి కట్టారని, వారు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. యర్రగొండపాలెం ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతోనే జగనన్నకు చెప్పి తాటిపర్తి చంద్రశేఖర్‌కు టికెట్ ఇప్పించానని, మంచి వ్యక్తి, ఎల్లవేళలా ప్రజల మధ్య ఉంటాడని అన్నారు. నియోజకవర్గ ప్రజలతో ఉన్న అవినాభావ బంధం ఈ నాటిదికాదని, ఆ నమ్మకంతోనే నేను ఇక్కడికి వచ్చానన్నారు. ప్రతి ఎన్నికల్లో పార్లమెంటు అభ్యర్థి అత్యధిక మెజార్టీ తీసుకొని వచ్చి గెలిపించేది యర్రగొండపాలెం నియోజకవర్గమేనని, ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డి పోటీ చేస్తున్నారని, ఆయనతో పాటు ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత మీపై ఉందని అన్నారు.



ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న తాటిపర్తి చంద్రశేఖర్, చెవిరెడ్డి భాస్కరరెడ్డి

వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి మాట్లాడుతూ యర్రగొండపాలేనికి మరో పులివెందుల అనే పేరుందని, ఆ పేరును మీరు సార్థకత చేయాలని, అందుకు తగినట్లు అభివృద్ధి చేస్తామని చెప్పారు. జగనన్నను మరో సారి ముఖ్యమంత్రిగా చేసుకొని పూర్తిగా వెనకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసుకుందామని, ఎమ్మెల్యే అభ్యర్థిగా తాటిపర్తి చంద్రశేఖర్, ఎంపీ అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నామని ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి మా ఇద్దరినీ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. యర్రగొండపాలెం నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో జెండా ఎగరేసి జగనన్నకు కానుకగా ఇద్దామని ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. ర్యాలీలో ఏపీఐఐసీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, నియోజకవర్గ అబ్జర్వర్ వెన్నా హనుమారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ యనమాల నాగార్జున యాదవ్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ముస్లిం మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ మజీద్, నియోజకవర్గంలోని ప్రజా ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలినేనిని గెలిపించండి

● ప్రముఖ సినీ నిర్మాత దిల్‌రాజు



ఒంగోలు: సార్వత్రిక ఎన్నికల్లో ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ప్రముఖ సినీ నిర్మాత దిల్‌రాజు ప్రజలను కోరారు. ఆమేరకు ఆయన వీడియో సందేశాన్ని మీడియాకు విడుదల చేశారు. ఒంగోలు ఎమ్మెల్యేగా ఐదుసార్లు ప్రాతినిధ్యం వహించిన బాలినేని నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. రెండు పర్యాయాలు మంత్రిగానూ సేవలందించారని చెప్పారు. మళ్లీ వైఎస్సార్ సీపీ తరఫున ఒంగోలు నుంచి ఆరోసారి పోటీ చేస్తున్నారని..ఆయన్ను గెలిపించాలని కోరారు.



చీమకుర్తిలో నామినేషన్ పత్రాలు అందజేస్తున్న మేరుగు నాగార్జున, పక్కన బాలినేని, బూచేపల్లి

పోటా పోటీగా నామినేషన్లు...

ఒంగోలు అర్బన్: ఒంగోలు పార్లమెంట్, జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బుధవారం 75 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి నలుగురు స్వతంత్ర అభ్యర్థులు, మరో నలుగురు ఇతరులు నామినేషన్లు వేశారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి యర్రగొండపాలెంలో వైఎస్సార్ సీపీ నుంచి తాటిపర్తి చంద్రశేఖర్, టీడీపీ నుంచి గూడూరి ఎరిక్షన్‌బాబు, కోలా శశిప్రీతం, ఇండియన్ కాంగ్రెస్ పార్టీ నుంచి బూదాల అజితారావు, ఇతరులు ముగ్గురు, దర్శిలో వైఎస్సార్ సీపీ నుంచి బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, టీడీపీ నుంచి లక్ష్మి, లలిత సాగర్ కడియాల, ఇతరులు ఐదుగురు, సంతనూతలపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నుంచి మేరుగు నాగార్జున, టీడీపీ నుంచి బీఎన్ విజయకుమార్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి విజేష్‌రాజ్ పాలపర్తి, ఇతరులు ఇద్దరు, ఒంగోలు అసెంబ్లీ నుంచి టీడీపీ అభ్యర్థిగా దామచర్ల జనార్దనరావు, దామచర్ల సత్యనారాయణ, ఇతరులు ఆరుగురు, కొండపి నుంచి టీడీపీ అభ్యర్థిగా డోలా రాజేశ్వరి, ఇతరులు ఇద్దరు నామినేషన్లు దాఖలు చేశారు. మార్కాపురంలో వైఎస్సార్ సీపీ నుంచి అన్నా దుర్గా కుమారి, అన్నా వెంకట రాంబాబు, టీడీపీ నుంచి కందుల నారాయణ రెడ్డి, ఇతరులు తొమ్మిది మంది, గిద్దలూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నుంచి కుందురు కల్పన, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి పగడాల పెద్ద రంగస్వామి, టీడీపీ నుంచి ముత్తుముల అశోక్ రెడ్డి, ముత్తుముల పుష్పలీల, ఇతరులు పది మంది, కనిగిరిలో వైఎస్సార్ సీపీ నుంచి దద్దాల నారాయణ, మంజు భార్గవి దద్దాల, టీడీపీ నుంచి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ఇతరులు ఐదుగురు నామినేషన్లు సమర్పించారు.



యర్రగొండపాలెంలో నామినేషన్ పత్రాలు ఇస్తున్న తాటిపర్తి చంద్రశేఖర్, పక్కన చెవిరెడ్డి భాస్కరరెడ్డి

క్లుప్తంగా

28న సోమిదేవిపల్లెలో ఎడ్ల పందేలు

రాచర్ల: మండలంలోని సోమిదేవిపల్లెలో ఈ నెల 28వ తేదీ ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త మూడగళ్ల వెంకటేశ్వరరెడ్డి, చైర్మన్ శీలం వెంగళ రెడ్డి తెలిపారు. గ్రామంలోని గణపతి, పోలేరమ్మ, అంకాలమ్మ, వీరభద్ర, నాగులమ్మ, నందీశ్వర, ప్రసన్నాంజనేయస్వామి, కాశీ విశ్వనాథ, మారెమ్మ, పోతురాజుల నాభి శిల (బొడ్రాయి), లక్ష్మి జగన్నాథస్వామి, ధ్వజ, శిఖర ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవం సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మొదటి బహుమతి రూ.80 వేలు, రెండో బహుమతి రూ.50 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు అందజేస్తామన్నారు. 9502520604, 7893172755 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గ్యాస్ లీకేజీతో అగ్ని ప్రమాదం


మంటల్లో కాలిపోయిన పూరిళ్లు

తర్లుపాడు: గ్యాస్ లీకై మంటలు అంటుకుని రెండు పూరిళ్లు దగ్ధం కాగా సుమారు రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు మార్కాపురం ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ తెలిపారు. మండలంలోని లింగారెడ్డి కాలనీలో మధ్యాహ్న సమయంలో మందా ఎలియేజర్ ఇంట్లో గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు లేచాయి. గుర్తించేలోపే పక్కనే ఉన్న కొమ్ము పోలయ్య పూరిగుడిసెకు కూడా అంటుకోవడంతో ఇక్కడ కూడా ఇంట్లో ఉన్న సిలిండర్ లీకై మంటలు చెలరేగాయి. వేసవికాలం కావడం, గాలులు ఎక్కువగా వీచడంతో పక్కనే ఉన్న మరో పూరిగుడిసెకు మంటలు వ్యాపించాయి. ఇంట్లో ఉన్న వంట సామగ్రి, దుస్తులు కాలిపోయాయి. మార్కాపురం ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపుచేశారు.

అబ్జర్వర్‌గా అరవింద కుమార్ చౌరశ్య నియామకం

ఒంగోలు: జిల్లాలోని ఒంగోలు, దర్శి, కొండపి, మార్కాపురం నియోజకవర్గాలకు ఎన్నికల అబ్జర్వర్‌గా ఐఏఎస్ అధికారి అరవింద కుమార్ చౌరశ్య నియమితులయ్యారు. ఆయన స్థానిక ఎన్ఎస్‌పీ గెస్ట్ హౌస్‌లో అందుబాటులో ఉంటారు.

బాలినేనికి బ్రహ్మరథం


రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న బాలినేని


రోడ్‌షోకు హాజరైన ప్రజలు

- మూడు డివిజన్లలో ఘనంగా రోడ్‌షో
- అడుగడుగునా హారతులు, పూలజల్లులు
- ఎక్కడకు వెళ్లినా వాసన్నా..నువ్వే మా నాయకుడివంటూ ఆప్యాయంగా పలకరింపు

ఒంగోలు: నగరంలోని 43, 44, 45 డివిజన్‌లలో ఎమ్మెల్యే బాలినేని రోడ్‌షోకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కాలనీల్లో అడుగడుగునా హారతులిస్తూ..పూలజల్లులు కురిపిస్తూ స్వాగతించారు. 43వ డివిజన్ శ్రీరామ్ కాలనీ వద్ద భారీ గజమాలతో ఆయనను స్వాగతించారు. ఈ సందర్భంగా బాలినేనికి 43వ డివిజన్ కార్పొరేటర్ కండే స్వాతి, డివిజన్ అధ్యక్షుడు కండే రమణయ్య యాదవ్, 44వ డివిజన్ కార్పొరేటర్, అధ్యక్షుడు గోపిరెడ్డి గోపాల్‌రెడ్డి, 45వ డివిజన్ కార్పొరేటర్ వెన్నపూస కుమారి వెంకటేశ్వరరెడ్డి, 45వ డివిజన్ అధ్యక్షుడు పల్నాటి రవీంద్రారెడ్డి, నగరపాలక సంస్థ కో ఆప్షన్ మెంబర్ వర్ధు శేషయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలినేనికి అడుగడుగునా హారతులు, దిష్టితీసి విజయీభవ అంటూ దీవించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.4,485 కోట్లతో అభివృద్ధి చేశామని తెలిపారు. సంక్షేమ పథకాలకు కొదవ లేదని, పార్టీల పేరుతో ఏరికోరి తీసివేతలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్లతోపాటు అన్ని పథకాలు అందించామన్నారు. విద్యుత్ శాఖామంత్రిగా హైటెన్షన్ వైర్లు తొలగింపుతో పాటు సబ్‌స్టేషన్లు నిర్మించామన్నారు. ఐదు అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణంతో పాటు ఉన్న 9 అర్బన్ హెల్త్ సెంటర్లలో అధునాతన వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు. నగరంలో టీడీపీ నేతల దుష్ప్రచారం నమ్మొద్దని, పదే పదే అబద్ధాన్ని ప్రచారం చేయడం ద్వారా ప్రజలను నమ్మించాలనే పచ్చ కుట్రను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 25 వేల మందికి ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్‌చేసి పంపిణీ చేశామన్నారు. మళ్లీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పట్టాలిచ్చిన వారందరికీ ఇళ్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వంలో దోచుకోవడం దాచుకోవడం తప్ప ప్రజల గురించి ఏనాడు పట్టించుకోలేదన్నారు. మరోసారి టీడీపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. చివరిసారి ఎన్నికల బరిలో దిగుతున్న తనను గెలిపించాలని, రానున్న ఐదేళ్లలో నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతానని బాలినేని ప్రజలకు హామీ ఇచ్చారు. కరోనా కష్ట సమయంలో అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా బాలినేని రోడ్‌షో వెనుకే వస్తున్న డిజిటల్ ప్రచార రథంలో నగరంలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పీడీసీసీబీ మాజీ చైర్మన్ మాదాసి వెంకయ్య, పార్టీ నగర కన్వీనర్ కఠారి శంకర్, భూమిరెడ్డి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖమంత్రి ఆదిమూలపు సురేష్
- విప్పగుంటలో కార్యకర్తల సమావేశం
- ఎన్నికలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని హితవు


విప్పగుంటలో సమావేశమైన మంత్రి సురేష్

పొన్నలూరు: రాష్ట్రంలో నవరత్న పథకాలతో నవశకం పూరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పారదర్శ పాలనకు మరోసారి పట్టం కట్టే విధంగా ప్రజలను చైతన్యం చేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. మండలంలోని విప్పగుంటలో బుధవారం వైఎస్సార్ సీపీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పాలన వలన గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల జీవన పరిస్థితులు మెరుగు పడ్డాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే ప్రతి పేదవానికి మరింత మేలు జరుగుతుందన్నారు. జగనన్న పాలనలో పేద, మధ్య తరగతి వారు సుఖంగా జీవిస్తుంటే చంద్రబాబు ఓర్వలేకపోతున్నాడన్నారు. గతంలో 600 హామీలు ఇచ్చి ఒక్క హామీ కూడా సక్రమంగా అమలు చేయని చంద్రబాబు, మళ్లీ ఎన్నికలు వచ్చే సరికి రాష్ట్రంలో తిరుగుతూ మోసపూరిత హామీలు ఇస్తున్నారని మంత్రి సురేష్ అన్నారు. మోసపూరిత వాగ్దానాలు, మాయ మాటలతో టీడీపీ నాయకులు గ్రామాల్లో ఓట్లు కోసం తిరుగుతున్నారని ప్రజలు వీరి మాటలను నమ్మరన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేసి కొండపి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేయాలని మంత్రి సురేష్ కోరారు. జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లపోలు బాలకోటిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, ముప్పా కోటేశ్వరరావు, దావులూరి మాల్యాద్రి, ఇడవలపాటి మాధవ, ముప్పా నరసింగరావు, చొప్పర మహేంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

గెలిచేది వైఎస్సార్ సీపీ జెండానే!


మాట్లాడుతున్న శివప్రసాద రెడ్డి

దొనకొండ: సార్వత్రిక ఎన్నికల్లో మూడు జెండాలు కలిసి పోటీ చేసినా గెలిచేది వైఎస్సార్ సీపీ జెండానే అని దర్శి ఎమ్మెల్యే అభ్యర్థి బూచేపల్లి శివ ప్రసాదరెడ్డి తెలిపారు. మండలంలోని గంగదేవిపల్లి, పెద్ద గుడిపాడు, ఎస్సీకాలనీ, దొండపాడు గ్రామాల్లో మాజీ సర్పంచ్ కర్నాటి ప్రసన్నాంజనేయ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మన ఊరికి మన శివన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ఒంటరిగా గెలవలేక రెండు జెండాలను కలుపుకుని పోటీ చేస్తున్నారని, పల్లెల్లోని ప్రజలు బాబును నమ్మే పరిస్థితి లేదని, మాట ఇస్తే తప్పని మన జగనన్న మరలా ముఖ్యమంత్రిని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. చంద్రబాబు 600 హామీలు ఇచ్చి ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని, మన జగనన్న ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం నెరవేర్చారని, అలాంటి వ్యక్తిని మనం ఎప్పుడూ మరిచి పోకూడదన్నారు. నేడు ఊరు వాడా ఏకమై జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. 2019లో రూ.60 లక్షలతో పెద్దగుడిపాడు ఎస్సీ కాలనీలో 2 సిమెంట్ రోడ్లు వేశామన్నారు. తాను ఎమ్మెల్యే, జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత ఇంటి పట్టాలు ప్రతి కుటుంబానికి మంజూరు చేసే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. గంగదేవిపల్లి మాజీ సర్పంచ్ కర్నాటి ప్రసన్నాంజనేయరెడ్డి.. శివప్రసాదరెడ్డి, వెంకాయమ్మను గజమాలతో సత్కరించారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వెంకాయమ్మ మాట్లాడుతూ తన బిడ్డతో పాటు, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి కాపా రమణారెడ్డి, ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, మాజీ కన్వీనర్ కాకర్ల క్రిష్టారెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, కర్నాటి ప్రసన్నాంజనేయ రెడ్డి, సర్పంచ్ ఎగ్గోని కుమారి, జేసీఎస్ కన్వీనర్ గుంటు పోలయ్య, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ గఫార్, గుంటు అజయ్, పిల్లి ఓబులరెడ్డి, బత్తుల వెంకట సుబ్బయ్య, తమ్మినేని సుబ్బారెడ్డి, పత్తికొండ సుబ్బయ్య, ముదమంచు క్రిష్ణమూర్తి, వెన్నపూస చెంచిరెడ్డి, కాలూరి రమణయ్య, డి.ఇస్మాయేల్, గుమ్మా ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెండు చోట్ల ఆటోలు బోల్తా

- వ్యక్తి మృతి, పలువురికి గాయాలు
- టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్ రెడ్డి నామినేషన్‌కు వెళ్లి తిరిగొస్తుండగా రెండు ప్రదేశాల్లో ప్రమాదాలు


మృతి చెందిన రావులపల్లి లక్ష్మయ్య

కంభం: గిద్దలూరులో టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్ రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి వెళ్లి తిరిగొస్తున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. మండలంలోని యర్రబాలెం వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. అర్ధవీడు మండలం మోహిద్దీన్ పురం గ్రామానికి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు ఆటోలో గిద్దలూరులో జరిగిన టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్ రెడ్డి నామినేషన్‌కు వెళ్ళి తిరిగి వస్తున్న సమయంలో మండలంలోని యర్రబాలెం సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో రావులపల్లి లక్ష్మయ్య (60) మృతి చెందాడు. రావులపల్లి ఆంజనేయులుకు తీవ్రగాయాలు కాగా కంభం ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స నిర్వహించి గుంటూరుకు తరలించారు. రావుల పల్లి పెద్ద కాశయ్య, చిన్న కాశయ్య కంభం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు వైద్యశాలకు చేరుకొని ప్రమాదానికి గల కారణాలు సేకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

చిన్నకంభం వద్ద..

పట్టణంలోని కొందరు యువకులు గిద్దలూరులో అశోక్ రెడ్డి నామినేషన్‌కు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో చిన్నకంభం వద్ద ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రఫి అనే వ్యక్తికి తీవ్రగాయాలు కాగా పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించి చికిత్స అందించారు. రెండు ప్రమాదాలు మద్యం మత్తులో ఉండటంతో జరిగినట్లు సమాచారం.

మేమంతా వాసన్న వెంటే..!

- కార్పొరేటర్ల ఐక్యత దెబ్బ తీసేందుకు టీడీపీ కుట్రలు సాగవు
- 20 వేల మెజార్టీతో వాసన్న గెలుపు ఖాయం
- ఎన్నికల్లో వాసన్న సైనికుల్లా పనిచేస్తాం
- మీడియా సమావేశంలో నగర మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్లు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మేయర్, పక్కన డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు

ఒంగోలు: కుట్రలు, కుతంత్రాలతో కార్పొరేటర్ల మధ్య ఐక్యతను దెబ్బతీయాలనే టీడీపీ కుట్రలకు కాలం చెల్లిందని నగర మేయర్ గంగాడ సుజాత స్పష్టం చేశారు. స్థానిక బాలినేనిన నివాసంలో బుధవారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 22న జరిగిన వాసన్న నామినేషన్ కార్యక్రమానికి అశేషంగా తరలివచ్చిన ప్రజానీకానికి, అభిమానులు, కార్యకర్తలందరికీ పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల సోషల్ మీడియా వేదికగా తెలుగుదేశం పార్టీకి చెందిన వారు నగరపాలక సంస్థలో కార్పొరేటర్ల మధ్య చిచ్చు పెట్టాలనే దుర్మార్గపు వ్యూహం తెరపైకి తెచ్చారన్నారు. తామంతా ఐక్యంగా ఉన్నా తమలో కొంతమంది జనార్దన్‌తో టచ్‌లో ఉన్నట్లు ప్రచారం చేసుకోవడం ద్వారా ఊహల పల్లకిలో ఊరేగుతున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్న ఈ అసత్య ప్రచారాన్ని ఖండించేందుకు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లంతా హాజరయ్యామన్నారు. వాసన్న అంటే ఒక దమ్ము, ధైర్యం, భరోసా అన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో వాసన్న 20వేల ఓట్లకుపైగా మెజార్టీతో గెలుపొందారని ధీమా వ్యక్తం చేశారు. మళ్లీ అధికారంలోకి రాగానే ఒంగోలు అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తామన్నారు. మేమంతా వాసన్న సైనికులమని..ఎన్ని కుట్రలు పన్నినా మమ్మల్ని వాసన్న నుంచి విడదీయలేరని స్పష్టం చేశారు. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసి మరి ఇంటిపట్టాలు మంజూరుచేస్తే దొంగ పట్టాలంటూ పదేపదే వల్లెవేయడం ద్వారా జనాలను నమ్మించాలనే కుట్రలను ప్రజానీకం నమ్మే పరిస్థితి లేదన్నారు. నగరంలో వాసన్నకు మరో ఆకాంక్ష ఉందని, అది నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పథకమన్నారు. వాసన్నను గెలిపించుకుని ఆ కల కూడా సాకారం చేసుకుందామన్నారు. వాసన్న అంటే శాశ్వత అభివృద్ధికి ఒక సాక్ష్యం అన్నారు. రిమ్స్, ఉలిచి చెక్‌డ్యాం, రామతీర్థం రిజర్వాయర్, గుండ్లకమ్మ ప్రాజెక్టు, రూ.339కోట్లతో పైపులైను నిర్మాణం, రూ.230కోట్లతో ఇళ్ల పట్టాల పంపిణీ ఇలా ఏ పథకం చేపట్టినా దీర్ఘకాలికంగా ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా చేస్తారన్నారు. ప్రజలు కూడా ఆలోచించుకోవాలని, త్వరలో జరిగే ఎన్నికల్లో దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ ఒంగోలు ఎమ్మెల్యేగా బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిలను అఖండ మెజార్టీతో గెలిపించుకోవడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ తరుపున గెలిచిన కార్పొరేటర్లంతా ఐక్యంగా కృషి చేస్తామన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్లు వెలనాటి మాధవరావు, వేమూరి సూర్యనారాయణ (బుజ్జి), ఇతర కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోండి

- కలెక్టర్ దినేష్‌కుమార్


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పక్కన ఎస్పీ సుమిత్ సునిల్

దర్శి/తాళ్లూరు(ముండ్లమూరు): ఓటర్లు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. దర్శి మండలంలోని తూర్పు వీరాయపాలెం, రాజంపల్లి గ్రామాల్లో, తాళ్లూరు మండలం శివరామపురం గ్రామాల్లో ఎస్పీతో కలిసి ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో జరిగిన వివిధ ఘటనలను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నాలుగు పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన జరిగిన విషయాలను దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదులపై 20 నిముషాల్లోనే చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఓట్లు ప్రశాంతంగా వేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎస్పీ గరుడ్ సుమిత్‌సునీల్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుందన్నారు. పోలింగ్‌కు ఆటంకాలు కలగకుండా ఇప్పటికే కొందరిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటు ఎంతో విలువైందని చెప్పారు. ఎటువంటి ఫిర్యాదులు అందినా, ఎటువంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తినా ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. గ్రామాల్లో ఉద్దేశ్యపూర్వకంగా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, ఆర్‌ఓ లోకేశ్వరరావు, డీఎస్పీ అశోక్‌వర్ధన్, సీఐ షమీముల్లా, తహసీల్దార్ షేక్ మహ్మద్ హుస్సేన్, ఎంపీడీఓ కె. యుగకీర్తి, ఎస్‌ఐ వైవీ రమణయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరంగా స్పెషల్ భద్రతా టీం గ్రామంలో డిఫెన్స్ డ్రిల్ నిర్వహించారు.

కమనీయం..రంగనాయకుని కల్యాణం


మాంగళ్యధారణం చేస్తున్న వేదపండితులు

రాచర్ల: రంగనాయక...పాహిమాం..అంటూ భక్తజనం పులకించిపోయారు. వేదపండితుల వేదమంత్రాల సాక్షిగా మంగళవాయిద్యాల నడుమ ముక్కోటి దేవతల దీవెనలతో నెమలిగుండ్ల రంగనాయకస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా సాగింది. జేపీ చెరువు సమీపంలోని నల్లమల అడవుల్లో వెలసిన నెమలిగుండ్లరంగనాయకస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన నెమలిగుండ్లరంగనాయకస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పరవశించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి బి.రమేష్ స్వామికి పట్టువస్త్రాలతో దేవస్థానం అర్చకులైన అన్నవరం పాండురంగాచార్యులు, అన్నవరం సత్యనారాయణచార్యులు అశేష భక్త జనం మధ్య కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణంలో మార్కాపురం ఎమ్మెల్యే, కేపీ నాగార్జునరెడ్డి సతీమణి కేపీ కల్పనారెడ్డి, గిద్దలూరు ఫారెస్టు డీడీ వై.నరసింహరావుతో పాటు 40 మంది ఉభయదాతలు దంపతులు కల్యాణ పీటలపై కూర్చున్నారు. సీఐ దాసరి ప్రసాద్, ఎస్సై వి.హరిబాబు,ఏఎస్సై ఆదిశేషయ్య భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు సత్రాల్లో అన్నదానం చేశారు.

'బలవంతంగా కండువా కప్పారు'


వైఎస్సార్ సీపీ కండువా కప్పుకున్న సురేష్

దర్శి: స్నేహితులతో కలిసి వెళ్తుండగా తెలిసిన వారి ద్వారా తీసుకువెళ్లి ఇష్టం లేకున్నా బలవంతంగా టీడీపీ కండువా కప్పారని రాజంపల్లి గ్రామానికి చెందిన పోతిపోగు సురేష్ స్పష్టం చేశారు. బుధవారం పట్టణ ఇన్‌చార్జి మారెడ్డి సుబ్బారెడ్డి చేతుల మీదుగా వైఎస్సార్ సీపీ కండువా కప్పుకొని మాట్లాడారు. సురేష్ మాట్లాడుతూ తనకు ఇష్టం లేకున్నా బలవంతంగా కండువా కప్పడంతో వెంటనే పక్కన పడేశానన్నారు. తాను ఎప్పటికీ వైఎస్సార్ సీపీలోనే ఉంటానని స్పష్టం చేశారు. శివన్నను గెలిపించుకునేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. జేసీఎస్ కన్వీనర్ బత్తినేని వెంకటేశ్వర్లు, ఎంపీపీ గోళ్లపాటి సుధా అచ్చయ్య, వనం విజయ్‌కుమార్, పోకూరి బ్రహ్మయ్య, గుర్రం చిన్నసుబ్బారావు, బండారు బాబు, మాజీ సర్పంచ్ గుణపాటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రెండు రోజుల్లోనే పట్టేశారు..

- చోరీ కేసులో ఇద్దరు నిందితులు అరెస్టు
- నిందితుల నుంచి రూ.45 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం
- కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సుమిత్ సునీల్


స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

ఒంగోలు సబర్బన్:

ఇటీవల చీమకుర్తిలో జరిగిన దొంగతనం కేసును పోలీసులు త్వరితగతిన ఛేదించారు. రెండు రోజుల్లోనే భారీ దొంగతనానికి పాల్పడిన ఇద్దరు దొంగలను పట్టుకున్నారు. అపహరణకు గురైన బంగారు ఆభరణాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి దొంగతానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని గెలాక్సీ భవన్‌లో వెల్లడించిన వివరాల మేరకు...చీమకుర్తిలోని కమ్మ విద్యానగర్ ఒకటో లైన్‌లో నివాసం ఉంటున్న పమిడి పద్మశ్రీ ఈనెల 21వ తేదీన బల్లికురవ మండలం పెద్ద అంబడిపూడిలో తన చిన్న తమ్ముడు మన్నం శ్రీరామమూర్తి చనిపోతే దశదిన కర్మకు కుటుంబంతో సహా వెళ్లారు. తిరిగి 22వ తేదీ ఇంటికి వచ్చి చూస్తే ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించి చీమకుర్తి సీఐ దుర్గాప్రసాద్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే సీఐ దుర్గాప్రసాద్ జిల్లా పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వటంతో క్లూస్ టీం, వేలిముద్ర నిపుణులు వెళ్లి పరిశీలించారు. ఇంట్లో ఉన్న రెండు బీరువాలు పగులగొట్టిన దొంగలు బీరువాల్లోని రూ.60 వేలు నగదుతో పాటు 598.7 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. ఈ దొంగతానికి పాల్పడిన ఇద్దరూ పాత నేరస్తులే. మొదటి నిందితుడు తాళ్లూరు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన వి.వేణుగోపాల్‌రెడ్డి, రెండో నిందితుడు చీమకుర్తి పాటిమీదపాలెంలోని జగనన్న కాలనీకి చెందిన వాడుగా గుర్తించారు. ఇద్దరిని అరెస్ట్ చేసి అపహరణకు గురైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. దొంగతనాన్ని వేగవంతంగా ఛేదించిన జిల్లా ఏఎస్పీ(క్రైమ్స్) ఎస్వీ శ్రీధరరావు, ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబు, చీమకుర్తి సీఐ దుర్గాప్రసాద్‌తో పాటు సిబ్బందిని అభినందించారు. రివార్డులతో పాటు నగదు పురస్కారాలు అందజేశారు.